క్లుప్తంగా

గురుకుల పాఠశాలకు 9 మంది ఎంపిక

సి.బెళగల్: మండల పరిధిలోని పోలకల్ ప్రాథమిక పాఠశాలకు చెందిన 9 మంది బీసీ విద్యార్థులు గురుకుల పాఠశాలలకు ఎంపికై నట్లు హెచ్ఎం రేవుల శ్రీనివాసులు తెలిపారు. పాఠశాలలో నాల్గో తరగతి చదివిన 8 మంది, 5వ తరగతి చదివిన ఓ విద్యార్థిని జిల్లాలోని పలు గురుకుల పాఠశాలలకు ఎంపికైనట్లు వెల్లడించారు. ప్రతిభ చాటిన విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు రవికుమార్, రాజేశ్వరిలను హెచ్ఎం, గ్రామ పెద్దలు అభినందించారు.

గ్రామాల్లో తాగునీటి సమస్య రానీయొద్దు

పాణ్యం: మండలంలో తాగునీటి సమస్య రాకుండా చర్యలు తీసుకోవాలని ఎంపీడీఓ భాగ్యలక్ష్మి పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు. శుక్రవారం గ్రామ కార్యదర్శులు, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులతో సమీక్షించారు. వేసవిని దృష్టిలో ఉంచుకుని నీటి సమస్య తలెత్తకుండా చూడాలన్నారు. సమస్యలు ఉన్న చోట ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకోవాలని తెలిపారు. ఏవైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్రగాయాలు


గాయపడిన వలమన్న

ఆదోని అర్బన్: మండలంలోని దిబ్బనకల్ గ్రామానికి చెందిన వలమన్న శుక్రవారం నెట్టేకల్ క్రాస్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్ర గాయాలపాలయ్యాడు. స్థానికులు వెంటనే ఆదోని ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి తరలించారు. వలమన్న సొంత పని నిమిత్తం బైక్‌పై గ్రామం నుంచి ఆదోనికి వస్తుండగా కారు ఢీకొట్టి వెళ్లిపోయింది. అక్కడున్న వారు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం డాక్టర్లు కర్నూలుకు రెఫర్ చేశారు. ప్రమాదంపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఏజెన్సీ ఉద్యోగుల అంతర్గత బదిలీలు

మహానంది: మహానందీశ్వరుడి దేవస్థానంలోని ఏజెన్సీ విభాగంలో పనిచేస్తున్న 30 మంది ఏజెన్సీ సిబ్బందికి విధులు మారుస్తూ ఈఓ కాపు చంద్రశేఖర్‌రెడ్డి శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈఓ మాట్లాడుతూ పరిపాలనా సౌలభ్యం కోసం విధుల్లో మార్పులు చేశామన్నారు. సమాచార కేంద్రం, వసతిగృహాల విభాగం, వివిధ ఆర్జిత సేవా కౌంటర్లలో పనిచేస్తున్న సిబ్బందికి స్థాన చలనం కలిగించామని చెప్పారు. ఎవరికి కేటాయించిన విధుల్లో వారు చేరాలని ఆదేశించారు.

పల్లకీలో మహానందీశ్వరుడి విహారం


పల్లకీ సేవలో పాల్గొన్న భక్తులు

మహానంది: మహానందిలో కొలువైన శ్రీ గంగ, శ్రీ కామేశ్వరీదేవి సమేత మహానందీశ్వరస్వామి వార్లకు శుక్రవారం రాత్రి పల్లకీసేవ వైభవంగా జరిగింది. ఈఓ కాపు చంద్రశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో వేదపండితులు రవిశంకర అవధాని, అర్చకులు స్వామి, అమ్మవార్లను విశేషంగా అలంకరించారు. గణపతిపూజ, పుణ్యాహవాచనం, అలంకార పూజ, బలిహరణ పూజల అనంతరం స్వామి, అమ్మవార్లు ఆలయ ప్రాకారాల్లో విహరించారు.

తగ్గని రద్దీ

మహానందిలో భక్తులరద్దీ తగ్గడం లేదు. వేసవి సెలవులు ఉండటంతో వేలాది సంఖ్యలో భక్తజనం తరలివస్తున్నారు. ఆలయానికి వచ్చిన భక్తులు శ్రీ కామేశ్వరీదేవి సహిత మహానందీశ్వరస్వామి వార్లను దర్శించుకుని అభిషేకం, కుంకుమార్చన పూజలు చేపట్టారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు


చెట్టును ఢీకొన్న లారీ

మహానంది: నంద్యాల–గిద్దలూరు నల్లమల ఘాట్‌రోడ్డులో చక్కెర లోడ్‌తో వెళ్తున్న లారీ బైక్‌ను ఢీకొట్టడంతో ముగ్గురికి గాయాలైన ఘటన శుక్రవారం చోటు చేసుకుంది. గిద్దలూరు పోలీసులు తెలిపిన వివరాల మేరకు...కర్ణాటక రాష్ట్రం నుంచి ప్రకాశం జిల్లా కంభం వస్తున్న లారీ నల్లమలలోని పురాతన ఇటుకల బ్రిడ్జివద్ద అద్దంకి నుంచి అనంతపురం వెళ్తున్న ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టి పక్కనే ఉన్న అడవిలోకి దూసుకెళ్లి చెట్టును గుద్దుకుంది. బేతంచర్ల మండలం హెచ్.కొట్టాలకు చెందిన డ్రైవర్, ఓనర్ మద్దిలేటితో పాటు బైక్‌పై వెళ్తున్న అద్దంకికి చెందిన అనిల్‌కుమార్, ఉప్పుతల రామకృష్ణ గాయపడ్డారు. గిద్దలూరు పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించి గాయపడిన వారిని 108 వాహనం ద్వారా చికిత్స నిమిత్తం గిద్దలూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

విత్తన ఎంపికే కీలకం

- కొనుగోలు సమయంలో అప్రమత్తత అవసరం
- లైసెన్స్ కలిగిన డీలర్ వద్ద కొనుగోలు చేయడం ఉత్తమం
- నాణ్యమైన విత్తనాలు, జాగ్రత్తలతో అధిక దిగుబడులు
- కర్నూలు ఏడీఏ సాలురెడ్డి సూచనలు

విత్తనం మంచిదైతే పంట బాగా పెరుగుతుంది.. దిగుబడులు మెరుగ్గా ఉంటాయి. కొందరు రైతులు విత్తనం విషయంలో తగిన జాగ్రత్తలు తీసుకోరు. దొరికింది కదాని ఏదో ఒకటి కొని విత్తుకుని నష్టపోతుంటారు. వ్యవసాయంలో రాణించడానికి, అధిక దిగుబడులు పొందడానికి నాణ్యమైన విత్తనాలను ఎంపిక చేసుకోవడం ఎంతో ముఖ్యం. రైతులు సరైన విత్తనం ఎంపిక చేసుకోకుండా ఎన్ని సస్యరక్షణ చర్యలు చేపట్టినా ఉపయోగం ఉండదు. కావున విత్తన ఎంపిక, కొనుగోలులో కొన్ని మెళకువలను తప్పనిసరిగా పాటించాలి.

కర్నూలు (అగ్రికల్చరల్): ఖరీఫ్ సీజన్ మొదలైంది. వర్షాలు ఆశాజనకంగా కురుస్తున్నాయి. రైతులు వ్యవసాయ పనులకు సిద్ధం అవుతున్నారు. ఈ క్రమంలో విత్తనాల కొనుగోలు, ఎంపికలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని వ్యవసాయశాఖ కర్నూలు సబ్ డివిజన్ సహాయ సంచాలకులు ఎస్.సాలురెడ్డి (8331057433) స్పష్టం చేశారు. మంచి దిగుబడి విత్తనం ఎంపికపై ఆధారపడి ఉంటుందని పేర్కొన్నారు. ఖరీఫ్ సీజన్ మొదలైన నేపథ్యంలో విత్తనాల ఎంపిక.. కొనుగోలులో ఈ జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అవేంటో చూద్దాం.

- ధ్రువీకరించిన మేలు రకం విత్తనాలను ప్రభుత్వ విత్తనాభివృద్ధి సంస్థల నుంచి లేదా పరిశోధన కేంద్రాలు, వ్యవసాయ శాఖ గుర్తించిన డీలర్ల నుంచి మాత్రమే కొనుగోలు చేయాలి.
- విత్తాలను కొనుగోలు చేసే సమయంలో లాటు నంబర్, తేదీ, రకం, గ్రామం తదితర వివరాలతో సంతకం చేసిన బిల్లును విక్రయదారుల నుంచి రైతులు విధిగా పొందాలి. ఆ బిల్లును పంట కోత పూర్తయ్యేంత వరకు రైతు జాగ్రత్తగా ఉంచుకోవాలి.
- విత్తన సంచిపై వేసిన గడువు తేదీని గమనించి కొనుగోలు చేయాలి. ఆ తేదీలోగా విత్తనాలను ఉపయోగించాలి. గడువు తేదీ ముగిసిన విత్తనాలు కొనుగోలు చేయొద్దు.
- విత్తన సంచిపై సూచించిన విధంగా మొలక శాతం, నికరతూకం పరీక్షించి ఉపయోగించాలి. పంట కాలం పూర్తయ్యే వరకు సంచిని జాగ్రత్త చేసుకోవడం అవసరం.
- సంకర విత్తనాన్ని (హైబ్రిడ్) ప్రతి పంటకు విధిగా మార్చుకోవాలి. హైబ్రిడ్ విత్తనాలు ఒక పంటకు మాత్రమే ఉపయోగపడుతాయి. పత్తిలో నిషేధిత విత్తనాలను వాడవద్దు. అనుమతిలేని, పర్యావరణనికి హానికలిగించే హెచ్‌టీ పత్తి విత్తనాలను వాడరాదు.
- మేలు రకపు అధిక దిగుబడినిచ్చే వంగడాలను విత్తనాభివృద్ధి సంస్థ ద్వారా కొని ఆ పంట ద్వారా అభివృద్ధి చేసిన విత్తనాలను రెండు మూడేళ్ల వరకు వాడుకోవచ్చు. తర్వాత తప్పనిసరిగా మార్చుకోవాలి.
- వ్యవసాయంలో అధిగ దిగుబడులు సాధించాలంటే నాణ్యమైన విత్తనం అవసరం. విత్తనం సేకరించేటప్పుడు తెగులు సోకని పంట నుంచి నాణ్యమైన దృఢమైన విత్తనాన్ని సేకరించి భద్రపరుచుకోవాలి.
- రైతు సేకరించే విత్తనాలు బాగా మొలకెత్తే శక్తి కలిగి, రంగు, పరిమాణం, ఆకారంలో విత్తనాలన్నీ ఒకే మాదిరిగా ఉండాలి.
- కేళీలు, ఇతర కలుపు మొక్కల విత్తనాలు లేకుండా చూసుకోవాలి.
- తాలు గింజలు, పూర్తిగా తయారు కాని గింజలను తొలగించడానికి ముందు రెండు శాతం ఉప్పు ద్రావణంలో పోసి పైకి తేలిన విత్తనాన్ని వేరుచేసి, మంచి నీటితో కడిగి ఆరబెట్టి ఉపయోగించాలి.
- బాగా ముదిరిన గింజలనే ఎంపిక చేసుకోవాలి విత్తనాలుగా వాడాలి. అనధికారికంగా విక్రయించే విత్తనాలను కొనుగోలు చేయరాదు. లూజు విత్తనాలు వాడడం మంచిది కాదు. అనుమతి లేకుండా విత్తనాలు అమ్మే వారిపై వ్యవసాయాధికారులకు ఫిర్యాదు చేయవచ్చు.


విత్తనాల నాణ్యతను పరిశీలిస్తున్న కర్నూలు ఏడీఏ సాలురెడ్డి

నేడు చర్చి ప్రారంభం


నూతనంగా నిర్మించిన సీఎస్ఐ చర్చి

పాణ్యం: మండల పరిధిలోని కొండజుటూరు గ్రామంలో నూతనంగా నిర్మించిన సీఎస్ఐ చర్చిని శనివారం ప్రారంభించనున్నారు. ఈ సందర్భంగా సంఘ పెద్దలు మాట్లాడుతూ.. ఉదయం 10 గంటలకు ప్రారంభమయ్యే ఆలయ ప్రతిష్ఠ మహోత్సవానికి బిషప్ ఐజక్ వరప్రసాద్ పాల్గొంటారని తెలిపారు. పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. 26వ తేదీ కబడ్డీ పోటీలు జరుగుతాయన్నారు. విజేతలకు రూ.30 వేలు, రూ. 25 వేలు, రూ.20 వేలు, రూ. 15 వేలు, రూ.10 వేల చొప్పున బహుమతులు అందజేస్తామని పేర్కొన్నారు. ఎంట్రీ ఫీజు రూ. 400 చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. అలాగే 27వ తేదీ న్యూ కేటగిరి వృషభాల బండలాగుడు పోటీలు నిర్వహిస్తున్నామని చెప్పారు. తొలి ఆరు స్థానాల్లో నిలిచే వృషభ యజమానులకు రూ.60 వేలు, రూ. 50 వేలు, రూ.40 వేలు, రూ.30 వేలు, రూ.20 వేలు, రూ.10 వేల చొప్పున ప్రోత్సాహక బహుతులను అందిస్తామన్నారు. రూ. 500 ఎంట్రీ ఫీజు చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలన్నారు.

కౌంటింగ్‌కు పకడ్బందీ చర్యలు


వాహనాల పార్కింగ్ ప్రాంతాన్ని పరిశీలిస్తున్న ఎస్పీ రఘువీర్‌రెడ్డి

- జిల్లా ఎస్పీ రఘువీర్‌రెడ్డి

పాణ్యం: సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్‌కు పకడ్బందీ చర్యలు చేపడుతున్నట్లు నంద్యాల జిల్లా ఎస్పీ రఘువీర్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం ఆయన ఈవీఎంలు భద్రపరిచిన ఆర్జీఎం, శాంతిరామ్ కళాశాలను తనిఖీ చేశారు. స్ట్రాంగ్ రూమ్‌లను కంట్రోల్ రూమ్ నుంచి పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జూన్ 4 తేదీన కౌంటింగ్ కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుందన్నారు. కౌంటింగ్ కేంద్రాల పరిసర ప్రాంతాల్లో బాణాసంచా కాల్చేందుకు, విజయోత్సవ ర్యాలీలకు అనుమతి లేదన్నారు. అనంతరం కౌంటింగ్ కేంద్రాల వద్ద వాహనాల పార్కింగ్‌కు స్థలాలను కేటాయించారు. ఆయన వెంట అడిషనల్ ఎస్పీ ప్రవీణ్ కుమార్, డీఎస్పీలు శ్రీనివాసరెడ్డి, రవీంద్రనాథ్ రెడ్డి, సంతోష్, పాణ్యం సీఐ నల్లప్ప ఉన్నారు.

దోమలు పెరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలి


దోమల వల్ల వచ్చే వ్యాధులపై అవగాహన కల్పిస్తున్న డీఎంహెచ్‌వో డాక్టర్ ప్రవీణ్‌కుమార్

కర్నూలు(హాస్పిటల్): ప్రభుత్వ అధికారులు, ఉద్యోగులు, సిబ్బందితో పాటు ప్రజలు కూడా ఇల్లు, పరిసరాల్లో దోమలు పెరగకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని డీఎంహెచ్ఓ డాక్టర్ వై.ప్రవీణ్‌కుమార్ సూచించారు. శుక్రవారం డాక్టర్స్ కాలనీలోని యూపీహెచ్‌సీ పరిధిలో నిర్వహించిన ఫ్రైడే డ్రైడే కార్యక్రమాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దోమకాటు వల్ల మలేరియా, ఫైలేరియా, చికున్‌గున్యా, మెదడువాపు, డెంగీ వ్యాధులు వస్తాయన్నారు. కొన్నిసార్లు అవి తీవ్ర పరిణామాలకు దారి తీస్తాయన్నారు. డెంగీ జ్వరం ఏడిస్ ఈజిప్టై అనే దోమ కుట్టడం వల్ల వస్తుందన్నారు. ఈ వ్యాధి లక్షణాలు సంక్రమణ తర్వాత మూడు రోజుల నుంచి 14 రోజుల్లోపు బయటపడతాయన్నారు. ఎముకలు, కండరాల్లో భరించలేనంత నొప్పి, కళ్లు కదలించలేని పరిస్థితి, శరీరంపై పొక్కులు వస్తాయన్నారు. తీవ్రమైన జ్వరం, భరించలేని తలనొప్పి, కీళ్లు, కండరాల నొప్పులు, నీరసం, ఆకలి మందగించడం, వికారం, వాంతులు, శరీరంపై దద్దుర్లు, చర్మం ఎర్రబడటం, అంతర్గత, బాహ్య రక్తస్రావం ఈ వ్యాధి ప్రధాన లక్షణాలు అని తెలిపారు. పరిస్థితి తీవ్రమైతే రక్తంలోని ప్లేట్‌లెట్లు తగ్గిపోతాయన్నారు. సాధారణంగా మన రక్తంలో 1,50,000 నుంచి 4,50,000 ప్లేట్‌లెట్స్ ఉంటాయని, గాయాలైనప్పుడు, రక్తం గడ్డకట్టేందుకు, గాయాలు త్వరగా మానేందుకు ఇవి సహాయ పడతాయన్నారు. ప్లేట్‌లెట్ల సంఖ్య తగ్గడం వల్ల మనిషి ప్రాణాలకే ప్రమాదమన్నారు. దీర్ఘకాలిక రోగుల్లో, డెంగీ వ్యాధుల్లో కూడా ప్లేట్‌లెట్లు తగ్గుతాయన్నారు. డెంగీ లక్షణాలు ఉన్న వారు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, సామాజిక ఆరోగ్య కేంద్రాల్లో వైద్యులను సంప్రదించి చికిత్స తీసుకోవాలన్నారు. వారు రక్త నమూనాలను సేకరించి కర్నూలు మెడికల్ కాలేజీలోని మైక్రోబయాలజీ విభాగానికి పంపి డెంగీ వ్యాధిని నిర్ధారణ చేస్తారన్నారు. ప్రజలు వారంలో ప్రతి శుక్రవారాన్ని డ్రైడేగా పాటించాలని, ప్రతి ఒక్కరూ వారి ఇళ్ల చుట్టూ నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని సూచించారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తత అవసరం


రోగ నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యాధికారి

కోడుమూరు రూరల్: వర్షాకాలంలో వచ్చే సీజనల్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కోడుమూరు కోలోకేటెడ్ పీహెచ్‌సీ వైద్యాధికారి శ్రీమంత్ మాదన్న సూచించారు. శుక్రవారం కోడుమూరులోని 3వ హెల్త్ సెంటర్ పరిధిలో స్థానిక వైద్య సిబ్బందితో కలిసి వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ప్రజలకు రోగ నిర్ధారణ పరీక్షలు జరిపి ఉచితంగా మందులను అందజేశారు. ఈ సందర్భంగా శ్రీమంత్‌మాదన్న మాట్లాడుతూ.. వర్షాకాలంలో దోమలు వృద్ధి చెంది మలేరియా, డెంగీ వంటి జ్వరాలు రావడంతో పాటు, కలుషిత నీరు తాగడం వల్ల అతిసార, డయేరియా వంటి వ్యాధులు ప్రబలే ప్రమాదముందన్నారు. ప్రజలంతా దోమల నివారణ కోసం ఇంటి పరిసరాల్లో నీరు నిల్వలేకుండా చూడాలని, దోమ తెరలు వాడడంతో పాటు కిటికీలు, తలుపులకు నెట్లు బిగించుకోవాలని, కాచి చల్లార్చిన నీటినే తాగాలని, శుభ్రమైన ఆహారాన్ని భుజించాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీహెచ్ఈఓ నరసప్ప, హెల్త్ సూపర్‌వైజర్ కమాల్ సాహెబ్, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ తిరుమలమ్మ, ఆరోగ్య, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

పది సప్లిమెంటరీ పరీక్షకు 90 మంది గైర్హాజరు

కోడుమూరు రూరల్: పదో తరగతి సప్లిమెంటరీ పరీక్షల్లో భాగంగా శుక్రవారం కోడుమూరు బాలుర హైస్కూల్, బాలికల హైస్కూల్, మోడల్ స్కూల్‌లో తెలుగు పరీక్ష జరిగింది. మొత్తం 181 మంది విద్యార్థులు పరీక్షకు హాజరుకావాల్సి ఉండగా 90 మంది గైర్హాజరైనట్లు ఎంఈఓ శరభయ్య తెలిపారు.

సి.బెళగల్‌లో 45 మంది గైర్హాజరు

సి.బెళగల్: మండలంలోని రెండు పరీక్ష కేంద్రాల్లో పదో తరగతి సప్లిమెంటరీ పరీక్షలు జరిగాయి. సి.బెళగల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో తెలుగు పరీక్షకు 40 విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా 19 మంది గైర్హాజరైనట్లు పరీక్ష కేంద్రం డిపార్టుమెంటల్ అధికారి అనంతయ్య తెలిపారు. అలాగే మోడల్ స్కూల్ పరీక్ష కేంద్రంలో 58 మంది పరీక్ష రాయాల్సి ఉండగా, 26 మంది గైర్హాజరైనట్లు పాఠశాల పరీక్షల చీఫ్ ధనుంజయగౌడ్ చెప్పారు. కాగా పరీక్ష కేంద్రాలను కర్నూలు డైట్ కళాశాల సీనియర్ లెక్చరర్ ముర్వా గోవిందు ఫ్లైయింగ్ స్క్వాడ్‌గా తనిఖీ చేశారు. ఎస్ఐ తిమ్మారెడ్డి పోలీస్ బందోబస్త్ ఏర్పాటు చేశారు.

నాటుసారా స్థావరాలపై దాడులు

ఆదోని రూరల్: మండలంలోని ఇస్వీ గ్రామ కొండల్లో ఆదోని పట్టణం వాల్మీకి నగర్‌కు చెందిన బోయ ఉదయ్ అనే వ్యక్తి నాటుసారా కాస్తుండగా పోలీసు సిబ్బందితో కలిసి దాడులు చేసినట్లు ఆదోని రూరల్ సీఐ నిరంజన్‌రెడ్డి శుక్రవారం విలేకరులకు తెలిపారు. నిందితుడు ఉదయ్ పోలీసులను చూసి తప్పించుకుని పారిపోయాడన్నారు. నాటుసారా స్థావరంలోని 1000 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేసినట్లు చెప్పారు. అలాగే 60 లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకుని, నిందితుడిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. త్వరలోనే నిందితుడిని పట్టుకుంటామన్నారు. ఇస్వీ ఎస్ఐ శ్రీనివాసులు, హెడ్‌కానిస్టేబుల్ రామయ్య, కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.

వడగండ్ల వాన


క్రిష్టదొడ్డిలో కురుస్తున్న వడగండ్ల వాన

సి.బెళగల్: మండలంలోని క్రిష్టదొడ్డి, బురాన్‌దొడ్డి తదితర గ్రామాల్లో శుక్రవారం వడగండ్ల వాన కురిసింది. ఉదయం నుంచి ఉక్కపోతగా ఉన్నా సాయంత్రం ఒక్కసారిగా వాతావరణం మారిపోయింది. గాలులతో మొదలై ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసింది. మండల వ్యాప్తంగా అర్ధ గంట పాటు వర్షం కురవడంతో వాతావరణం చల్లబడింది.

ఘనంగా అన్నమయ్య జయంతి

కర్నూలు కల్చరల్: ఓల్డ్‌సిటీలోని లలితా పీఠంలో శుక్రవారం తొలి తెలుగు వాగ్గేయకారుడు, పద కవితా పితామహుడు తాళ్లపాక అన్నమాచార్యుల జయంతి వేడుకలను ఘనంగా జరిగాయి. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి పూజలు చేశారు. శ్రీ వెంకట అన్నమాచార్య సేవా ట్రస్ట్ కళాకారులు, శ్రీ వెంకటేశ్వర సంగీత నృత్య కళా నిలయం, శ్రీ సూర్య కళా కల్చర్ అకాడమీ విద్యార్థులు నృత్య ప్రదర్శనలు, భజనలు, సంకీర్తనలు అలరించాయి. కార్యక్రమంలో లలితా పీఠం పీఠాధిపతి మేడా సుబ్రహ్మణ్యస్వామి, ఇస్కాన్ సంస్థ కర్నూలు బాధ్యులు రఘునందన సేవక్ ప్రభు, లలతా సంఘం అధ్యక్షులు జ్ఞానేశ్వరమ్మ, బొమ్మిరెడ్డి పల్లె శ్రీభీమలింగేశ్వర స్వామి దేవస్థానం ధర్మకర్త పూడూరు లక్ష్మీరెడ్డి, వెల్దుర్తి హనుమాన్ జంక్షన్ వ్యవస్థాపకులు రామరాంజనేయులు పాల్గొన్నారు.

ఘనంగా నారద మహర్షి జయంతి


మాట్లాడుతున్న త్రిదండి అష్టాక్షరీ సంపత్కుమార రామానుజ జీయర్

కర్నూలు కల్చరల్: నగర శివారులోని గోదా గోకులంలో నారద మహర్షి జయంతిని ఘనంగా నిర్వహించారు. శుక్రవారం జరిగిన కార్యక్రమంలో శ్రీశ్రీశ్రీ త్రిదండి అష్టాక్షరీ సంపత్కుమార రామానుజ జీయర్, శ్రీశ్రీశ్రీ త్రిదండి బృందావన రామానుజ జీయర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా శ్రీశ్రీశ్రీ త్రిదండి అష్టాక్షరీ సంపత్కుమార రామానుజ జీయర్ మాట్లాడుతూ పురాణ కాలం నుంచి వార్తా హరుల కాలం ఉందన్నారు. నారద మహర్షి వార్తలను చేరవేస్తూ లోక కల్యాణానికి పాటు పడ్డారన్నారు. నారదుడు మంత్రవేత్త, త్రికాల వేత్త అన్నారు. ఏ సమయంలో ఎవరితో ఎలా మసలుకోవాలో, ఎలాంటి విషయాలను చేరవేయాలో తెలిసిన లోక జ్ఞాని అన్నారు. కార్యక్రమంలో గోదా గోకులం వ్యవస్థాపక అధ్యక్షులు మారం నాగరాజు గుప్త, గోదా గోకులం పరివారం పాలాది సుబ్రహ్మణ్యం, పెరుమాళ్ల బాల సుధాకర్, చిత్తారి వీరయ్య, ఇటిక్యాల పుల్లయ్య, ఇల్లూరి రామయ్య, వేముల రవిప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

కర్ణాటక మద్యం పట్టివేత

- ఒకరి అరెస్టు.. మరొకరు పరారీ


స్వాధీనం చేసుకున్న మద్యం, ద్విచక్రవాహనాలను ప్రదర్శిస్తున్న సెబ్ అధికారులు

కోడుమూరు రూరల్: కోడుమూరు సెబ్ పరిధిలోని క్రిష్ణగిరి మండలం ఆగవేలి–సంగాల గ్రామాల మధ్య ఉన్న చిన్న గుట్ట కనుమ వద్ద శుక్రవారం రెండు ద్విచక్రవాహనాలపై తరలిస్తున్న కర్ణాటకకు చెందిన 480 టెట్రా ప్యాకెట్ల మద్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు సెబ్ సీఐ రామాంజనేయులు తెలిపారు. బేతపల్లి రవికుమార్‌ను పట్టుకున్నామని తెలిపారు. సంగాలకు చెందిన మద్దయ్య పరారయ్యాడని చెప్పారు. నిందితుల నుంచి రెండు ద్విచక్రవాహనాలు, రూ.30 వేలు విలువ చేసే మద్యాన్ని సీజ్ చేసినట్లు సీఐ పేర్కొన్నారు. దాడుల్లో సెబ్ ఎస్ఐ అలీబేగ్, సిబ్బంది హనుమంతు, శంకర్‌నాయక్, విరుపాక్షి రెడ్డి పాల్గొన్నారు

హోరాహోరీగా గిరకబండి పోటీలు

పెద్దకడబూరు: చిన్నకడబూరు ఆంజనేయస్వామి జాతర సందర్భంగా నిర్వహించిన గిరక బండి పోటీలు శుక్రవారం హోరాహోరీగా సాగాయి. ఈ పోటీల్లో 8 జతల ఎద్దులు పాల్గొనగా చింతకుంట గ్రామానికి చెందిన నాగేష్ వృషభాలు 3100 మీటర్ల దూరం లాగి విజేతగా నిలిచాయి. అలాగే చింతకుంట హనుమంతు వృషభాలు 2997 మీటర్లు, కలిగెట్ల వీరాంజనేయులు వృషభాలు 2990 మీటర్లు లాగాయి. వీరికి వరుసగా రూ.11 వేలు, రూ.8 వేలు, రూ.5 వేలు చొప్పున బహుమతులు ప్రదానం చేశారు.

డాక్యుమెంట్ పోయినది

U. శివకుమార్ S/o మల్లిఖార్జున ఇ.నెం: 4–66, క్రిష్ణపురం గ్రామం, కోడుమూరు మండలం కర్నూలు జిల్లా వారు తెలియజేయడం ఏమనగా నా యొక్క కమర్షియల్ స్థలంకు సంబంధించిన ఒరిజినల్ లింకు డాక్యుమెంట్ తేది: 21.04.2024న ఇంటి నుండి కోడుమూరు వెళ్ళే దారిలో పడిపోయినది. డాక్యుమెంట్ నెం: 6109/2018. కావున ఎవరికైన దొరికిన యెడల పైన తెలిపిన నా యొక్క అడ్రస్‌కు ఇవ్వగలరు.
సెల్: 6303519194

మైనారిటీ పాలిటెక్నిక్‌కు ఎన్‌బీఏ గుర్తింపు

- 52 మంది విద్యార్థులకు వివిధ కంపెనీల్లో ఉద్యోగాలు


ఉద్యోగాలు పొందిన విద్యార్థులతో అధికారులు

కర్నూలు(అర్బన్): నగర శివారులోని ప్రభుత్వ మైనారిటీ పాలిటెక్నిక్ కళాశాలకు ఎన్‌బీఏ (నేషనల్ బోర్డు ఆఫ్ అక్రిడియేషన్ సర్టిఫికెట్) గుర్తింపు లభించిందని కళాశాల ప్రిన్సిపాల్ చక్రవర్తి తెలిపారు. 2023–24 విద్యా సంవత్సరంలో ఫైనల్ ఇయర్ చదివిన మెకానికల్, కంప్యూటర్, ఆటోమొబైల్ ఇంజినీరింగ్‌లో 102 మంది విద్యార్థులకు గానూ 52 మంది విద్యార్థులు వివిధ కంపెనీల్లో ఉద్యోగాలు సాధించిన సందర్భంగా శుక్రవారం అచీవర్స్ డేను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ఏపీఈడబ్ల్యూఐడీసీ ఈఈ లక్ష్మీనారాయణ, డీఈఈ గోన నాగరాజు, మేరు జీఎం సుదర్శన్ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ చక్రవర్తి మాట్లాడుతూ.. తమ కళాశాలకు ఎన్‌బీఏ గుర్తింపు లభించడం వల్ల విద్యార్థులకు ఉద్యోగ అవకాశాలు వస్తున్నాయన్నారు. ఏపీఈడబ్ల్యూఐడీసీ ఇంజినీర్లు కృషితో నిర్ణీత సమయంలోనే కళాశాలలో పలు వసతుల కల్పన సాధ్యమైందన్నారు. ఈ నేపథ్యంలోనే ఉద్యోగాలు పొందిన విద్యార్థులకు జాబ్ ఆఫర్ పత్రాలను అందించారు. కార్యక్రమంలో హెడ్ ఆఫ్ జనరల్ సెక్షన్ శ్రీధర్, మెకానికల్ సెక్షన్ హెడ్ కోల రాఘవానంద్, కంప్యూటర్ సెక్షన్ హెడ్ ఎస్.సురేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పెద్దాసుపత్రిలో విద్యుత్ సరఫరాలో అంతరాయం

కర్నూలు(హాస్పిటల్): కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో శుక్రవారం ఉదయం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడింది. క్యాజువాలిటీ, ఏఎంసీ, ఓపీ విభాగాల్లో ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. ఇందుకు సంబంధించి ట్రాన్స్‌ఫార్మర్ వద్ద సమస్య ఏర్పడటంతో విద్యుత్ సరఫరా ఆగిపోయింది. ఇదే సమయంలో జనరేటర్ కూడా మొరాయించింది. ఈ కారణంగా ఓపీ భవనం మొత్తం విద్యుత్ సరఫరా నిలిచిపోయి సేవలకు అంతరాయం ఏర్పడింది. క్యాజువాలిటీ, ఏఎంసీలలో రోగులు ఇబ్బంది ఎదుర్కొన్నారు. ఓపీకి వచ్చిన రోగులకు వైద్యులు సెల్‌ఫోన్ లైట్లు ఆన్ చేసి వైద్యం అందించాల్సి వచ్చింది. రెండు గంటల అనంతరం విద్యుత్ సరఫరా పునరుద్ధరించడంతో రోగులు ఊపిరిపీల్చుకున్నారు.

రేపు 'చీకట్లో శెంద్రుడు' నాటక ప్రదర్శన

కర్నూలు కల్చరల్: టీజీవీ కళాక్షేత్రం ఆధ్వర్యంలో ఈనెల 26వ తేదీ సాయంత్రం పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేసినట్లు కార్యక్రమ కన్వీనర్లు యాగంటీశ్వరప్ప, ఈశ్వరయ్య శుక్రవారం తెలిపారు. సాయంత్రం 6.30 గంటలకు గోవింద రాజుల స్వామి బ్రహ్మోత్సవ నృత్య ప్రదర్శన, 7 గంటలకు హైదరాబాద్ మల్లాది క్రియేషన్స్ వారిచే 'చీకట్లో శెంద్రుడు' సాంఘిక నాటక ప్రదర్శన ఉంటుందన్నారు.